# మినీకథలు



## మార్పు

-పుప్పాల సత్యనారాయణ

త్రనకు పిల్లనిచ్చేవాళ్ళు ఆ రోజు తనను చూడడానికి వస్తారని శివన్నారాయణకు ముందుగానే తెలుసు. అందుకనే ఎందుకైనా మంచిదని ముందుగానే వాళ్ళనాన్న వరంధామయ్యతో కట్నం దగ్గర పేచీపెట్టవద్దనీ, వాళ్ళు ఎంత ఇస్తామంటే అంతే చాలని చెప్పమనీ బ్రతిమాలాడు. కారణం తండ్రి డబ్బుమనిషని తెలుసు గనుక.

"నువ్వు నోరుమూసుకూర్చోరా...." గదిమాడు వరంధామయ్య.

'నా మాటకు ఎప్పుడు విలువిచ్చాడులే' అనుకొని బాధను దిగమింగి ఆలోచనలో పడిపోయాడు శివన్నారాయణ.

సాయంత్రం నాలుగ్గంటలకు ముగ్గురు పెద్దమనుష్యులు అచ్చ తెలుగువారిలా అంటే పంచలు. లాల్చీలు ధరించి జరీ అంచు ఉత్తరీయాంతో ఇంటి ముందు దిగారు. వరంధామయ్య వంగి. వంగి నమస్కరించాడు ముగ్గురికీ.

"భీమాస్ బందరు మిఠాయి"షాపునుంచి ఖరీదైన ఫలహారాలు తెప్పించి ఆతిథ్యం పూర్తి చేశాడు వరంధామయ్య. ఎన్నడూ పైసా ఖర్చుపెట్టని సాక్షాత్తూ తన తండ్రి తన పెళ్ళిచూపుల కోసం ఇంత ఖర్చు చేస్తుంటే శివన్నారాయణకు నమ్మశక్యం కాలేదు.

"ఈ రోజుల్లో పెళ్ళిలో ముఖ్యం పిల్లకు పిల్లాడు, పిల్లాడికి పిల్లా వచ్చాలండీ. అంతే గాని వెధవ డబ్బుదేముందీ!" వరంధామయ్య అంటుంటే వెనుక గదిలోనుంచి వింటున్న శివన్నారాయణకు మూర్ఛ వచ్చినంత పనయింది. నాన్నేనా ఈ మాటలంటున్నది అని అనుమానమొచ్చి ఒకసారి కిటికీలో నుంచి తొంగి చూశాడు కూడా.

"అవుననుకోండి. కానీ మనం కట్నం విషయాలు ముందే మాట్లాడుకోవటం మంచిదని నా ఉద్దేశ్యం." వచ్చినవాళ్ళల్లో ఒకరు.

"కట్నం మాట్లాడుకోవటం మంచిదే ననుకోండి. ముందు పిల్లా, పిల్లాడు ఒకర్నొకరు ఇష్టపడితే ఆ తర్వాత కట్నం ఏదో తృణమో ఫలమో...." అంటున్నాడు వరంధామయ్య.

తండ్రిలో ఇంత మార్పు కట్నం విషయంలో వచ్చినందుకు ఎంతో సంతోషంగా వుంది శివన్నారాయణకి.

అంతలో వాళ్ళమ్మ వెనుకనుంచి వచ్చి ఒక మొట్టికాయ వేసి "చెల్లాయికి పెళ్ళి సమ్మంధం మాట్లాడుతుంటే మొద్దులా ఇక్కడ కూర్చున్నావేమిరా" అనేసి చరచరా లోపికెళ్ళింది.

అప్పటికిగాని పాపం శివన్నారాయణకు తండ్రి మాటల్లోని అంతర్యం అంతుబట్ట లేదు మరి!

---

## నష్టం లేని బేరం

అవధానం లలితాంబ



"పాత పేపర్లు కొంటాం. పాత పుస్తకాలె" అన్న కేక విని ఒక్క గెంతులో వాకిట్లోకి వచ్చి "పాత పుస్తకాలు-య్రో!" అది కేకవేసింది రమణి.

పనికిరాని కాయితం యింట్లో ఒక్కటైనా లేకపోయినప్పటికి రమణి పాత పుస్తకాలు కొనేవాడిని ఎందుకు పిలుస్తున్నదో అర్థంకాక రమణి తల్లి. "వాడికి అమ్మడానికి యింట్లో ఏమున్నాయని పిలుస్తున్నావే? నీకేమన్నా మతిగాని పోయిందా ఏమిటి?" అని అంటుంటే. "నువ్వుండమ్మా, నీకేం తెలీదు" అని చెప్పి పాతపుస్తకాలు కొనే వాడిని లోపలికి పిలుచుకొచ్చింది.

పాత పుస్తకాలు కొనేవాడు మూటను భుజంమీదనుంచి దించుకొన్న తరువాత-

"వారపత్రికలయితే ఎంత" అని అడిగింది.

"కిలో రూపాయ."

"పాత నవల్లు. చిన్న పుస్తకాలు."

"కిలో అరవై పైసలు."

"నీ దగ్గర చిన్న పుస్తకాలు ఎన్నున్నాయో తూచు."

"ఎందుకమ్మా?"

"ఈ పుస్తకాలు నువ్వయినా ఇంకోరికి అమ్మేవేగా. అక్కడిదాకా మోసుకొని పోవడమెందుకు? నేను తీసుకుంటాను."

"అలాగే" అని పుస్తకాలన్నీ తూచాడు. మొత్తం అయిదు కిలోల చిన్న పుస్తకాలు, నాలుగు కిలోల వార పత్రికలు వున్నాయి. పుస్తకాలన్నీ తీసుకొని ఏడు రూపాయలు వాడికిచ్చి పంపించేసింది.

"ఈ పుస్తకాలన్నీ ఎందుకే!!!" అని తల్లి ఆశ్చర్యంగా అడుగుతుంటే-

"అమ్మా! నువ్వేమో పుస్తకాలు కొనమంటే కొనవు. పక్కింటివాళ్ళనడిగితే వాళ్ళివ్వరు. కొనుక్కోడానికి నా దగ్గర డబ్బులుండవు. మరి నాకు టైం పాసయ్యేదెట్లా? ఏడు రూపాయలకు రెండుసినిమాలే వచ్చేది. అందుకే ఈ నెల్లో సినిమాకని నువ్విచ్చిన డబ్బులు దాచి ఈ పని చేశాను. ఈ పుస్తకాలన్నీ చదవాలంటే కనీసం ఓ నెలయినా పడుతుంది. చదివేసింతరువాత తిరిగికొట్టుకు యిదే రేటుకు వేసెయ్యొచ్చు. నష్టంలేని లాభసాటి బేరం" అని అప్పుడే కొనుక్కున్న ఒక పాత వారపత్రికలో తల దూర్చేసింది రమణి.